
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు


5★★

సోమవారం 5 ఫిబ్రవరి 2024

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి 7లో..

రహదారులు బాగుపడేదెన్నడో..? 8లో..

జిల్లాకు రూ. 30 కోట్లు



ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం...

ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగంలో ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతిచ్చింది. ఒక్కో ఎమ్మెల్యేకు కేటాయించిన రూ. 10 కోట్లలో రూ. 2 కోట్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలని ఆదేశించింది. మరో కోటి రూపాయలను అ సెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్క రించేందుకు వెచ్చించాలని సూచించింది. మరో రూ. 50 లక్షలను కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలలు, తాగు నీరు, కార్యాలయాల నిర్వహణకు సంబంధించి రూ. 3.5 కోట్లు పోగా మిగి లిన రూ. 6.5 కోట్లను తమ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక తనిఖీలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. తద్వారా నాణ్యత ప్రకారం గానే జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేల్లో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి.

- ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగ బాధ్యత ఇన్‌చార్జి మంత్రికి
- ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 10 కోట్ల చొప్పున కేటాయింపు
- వచ్చే నెలాఖరు వరకు వ్యయం చేయడానికి అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకు ప్రత్యేక అభి వృద్ధి నిధి (ఎస్‌డిఎఫ్) నిధులు రూ. 30 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మె ల్యేల విజ్ఞప్తులు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున జిల్లాలో ని మూడు నియోజకవర్గాలకు రూ. 30 కోట్లు కేటాయిస్తూ జీవో నం. 22 జారీ చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి బాధ్యత లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అప్ప గించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీ లోగా ఖర్చు చేసేందుకు అవకా శం కల్పించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనల ను ఎమ్మెల్యేలు సంబంధిత అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాల్సి ఉంటుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వాటిని వెచ్చించాలి. ఈ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మె ల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో చేపట్టే పనుల ప్రతిపాదనల తయారీ కసరత్తులో నిమగ్నమయ్యారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అడ్లూ రి లక్ష్మణ్ కుమార్‌లు ఇప్పటికే సంబంధిత నిధుల వినియోగంపై దృష్టి సారించారు.

ఎమ్మెల్యేలు అడగకుండానే....

సాధారణంగా ఎస్‌డీఎఫ్ నిధులను ఎమ్మెల్యేలు విజ్ఞప్తుల మేరకే ప్రభు త్వం విడుదల చేస్తోంది. తమ నియోజకవర్గ పరిధిలో ఫలానా పనులు చేపట్టాల్సి ఉందని, అందుకు ప్రత్యేక నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే లు సీఎంను కోరితే అందుకనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ సర్కారులో సైతం ఇలాగే జరిగే ది. కానీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు అడ గకుండానే ఒక్కొక్క నియోజకవర్గానికి రూ. 10 కోట్లు చొప్పున నిధులను కేటాయించింది. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గాల్లో విపక్ష పార్టీకి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిత్యం వహిస్తుండగా, ధర్మపురి నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రాతినిత్యం వహిస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేతో పాటు విపక్ష పార్టీ ఎమ్మెల్యేలు సైతం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేప ట్టేందుకు వీలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

కొత్తగా చేపట్టే పనులకు ఎస్‌డీఎఫ్...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు కరీం నగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల మండ లాలు, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని మేడిపల్లి, కథలాపూర్, బీమారం మండలాల్లో కొత్తగా చేపట్టబోయే పనులకు మాత్ర మే ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో చేపట్టే పనులు ఇంతకు ముందు ఏ పథకం కింద చేసి ఉండకూడదని స్పష్టం చేసింది. ఆయా ఎమ్మెల్యేల సమన్వయంతో ప నులను ప్రతిపాదించి ముందుకు వెళ్లడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి.

● తాగు నీరు అందని గ్రామాల సర్వే..

జిల్లాలో ఏయే ప్రాంతాలకు తాగునీరు అందట్లేదో సమగ్ర సర్వే నిర్వ హించాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సం బంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసిన ట్లుగానే పక్కాగా తాగునీరు అందని అవాసాల జాబితాను సిద్ధం చేయా లని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతి పాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించడానికి కసరత్తులు చేస్తు న్నారు. అత్యవసరమైన ప్రాంతాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించడానికి ప్రయత్నాలు జరుగుతు న్నాయి. అదేవిధంగా రోడ్డు సౌకర్యంలేని గ్రామాల్లో రోడ్లను నిర్మించడానికి, అవసరమైతే ఉపాధి హామీ నిధులను అనుసంధానించి వాటిని పూర్తి చేయడానికి కసరత్తులు జరుగుతున్నాయి.

ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్లు వచ్చాయి

- పూర్ణచందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 10 కోట్లు కేటాయిస్తూ ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పనులు ప్రతి పాదించాల్సి ఉంటుంది. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజక వర్గాలకు నిధుల కేటాయింపు జరిగింది. నిధుల వినియోగం చేయడానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్



మోరపల్లి లో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 4 : పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్విని యోగం చేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ కోరారు. కోరుట్ల వెటర్నరీ కళాశాల, జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా చేపట్టి న జాతీయ సేవా పథకంలో భాగంగా మోరపల్లి గ్రామంలో పశువైద్య శిబిరా న్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ హాజరై ప శువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ పాడిపరిశ్రమ ఆవశ్యకత రైతుల ఆర్థికవృద్ధిలో ముఖ్య భూమికను పోషిస్తుం దని సూచించారు. పాడిరైతులు పశువైద్యాధికారుల సూచన మేరకు జాగ్రత్త లు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నరేష్‌రెడ్డి, మనీషా, హిమజ, ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తమ్మగంగారాం, వెటర్నరీ కళాశాల డీన్ మాధవరావు పాల్గొన్నారు.

కోటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్పీ



కోటిలింగాలలో శివ లింగానికి పూజలు చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

వెల్గటూర్, ఫిబ్రవరి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలలో కొలువై ఉన్న శ్రీ కోటేశ్వర స్వామికి జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదివారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఎస్పీని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాత వాహనుల తొలి రాజధానిగా ఖ్యాతి గాంచిన కోటిలింగాలను దర్శించడం సం తోషంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో గోదావరి ఒడ్డున కొలు వై ఉన్న కోటేశ్వర స్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నాన న్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్ బీజేపీ అసెంబ్లీ ప్రభారీగా శ్రీనివాస్

ధర్మపురి, ఫిబ్రవరి 4: ముథోల్ బీజేపీ అసెంబ్లీ ప్రభారీగా పిల్లి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం బీజేపీ అధిష్ఠానం నియా మకపు లేఖను పంపించింది.

ధర్మపురి పట్టణానికి చెందిన శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, బీజే వైఎం, బీజేపీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పదవులు పొందారు. ప్ర స్తుతం బీజేపీ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా, సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా పని చేస్తున్నారు. బీజేపీ బలోపేతం కోసం ఆయన కృషి చేసినందులకు గుర్తింపుగా ఈ పదవి లభించింది. తన నియామకానికి సహ కరించిన బీజేపీ రాష్ట్ర నా యకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి



ఏఈఓకు వినతిపత్రం అందజేస్తున్న హిందూవాహిని సభ్యులు

మల్యాల, ఫిబ్రవరి 4: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ వాహిని ఆధ్వ ర్యంలో ఆదివారం ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీ వల సమ్మక్క సారక్క భక్తుల రద్దీ పెరిగిందని తగు వసతి ఏర్పాటు చేయ డంతో పాటు కేశఖండం వద్ద దోపిడిని అరికట్టడానికి టోకెన్ సిస్టం అమలు చేయాలని ఈ సందర్భంగా అన్నారు. కోనేరు, మునులు గుహ వెళ్లే దారిలో శానిటేషన్ చేయాలని ప్రసాదాల తయారి వద్ద గల డంపింగ్ యార్డ్‌ను త రలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని అధ్యక్షుడు కోల సు రేందర్, సాగర్, వేణు, అరవింద్, వికాష్, సురేష్ పాల్గొన్నారు

ట్రస్మా జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా బోయినిపల్లి శ్రీధర్‌రావు ఏకగ్రీవం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) జిల్లా అధ్యక్షుడిగా బోయినిపెల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మహదేవ్, కోశాధికారిగా కృష్ణప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బోగ రవి ప్రసాద్, ముఖ్య సలహాదారునిగా దినేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకైన ట్లు ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు శేఖర్‌రావు తెలిపారు. ఆదివారం జరిగిన ట్రస్మా సమావేశంలో భాగంగా మొదటగా పారమిత ప్రసాద్ ఆధ్వర్యం లో మంతన్-2024 పేరుతో విద్యావ్యవస్థలో మా ర్పులు, పలు అంశాలు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రక్రి యలో భాగంగా జిల్లా అ సోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆనంద్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యాల రాజిరెడ్డి, మహేందర్, శ్రీధర్‌లను ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యద ర్శులుగా గోపి, శంకర్‌శర్మ, దయానంద్, ఆర్గనై జింగ్ సెక్రటరీగా గంగాధర్, మల్లేశం, శ్రీనివాస్, స్పోక్స్ పర్సన్‌గా ఉమాకాంత్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎంఏ బారి, ఎగ్జామినేషన్ సెక్రటరీగా అశోక్, కల్చరల్ సెక్రటరీగా గంగాధర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా నారా యణ, రాజు, దయానంద్, శ్రీనివాస్, రమేష్, గంగాధర్, శ్రీనివా సరావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రవీందర్‌రావు, రాబర్ట్, మహేష్‌లు వ్యవహరించారు.



టస్మా జిల్లా కార్యవర్గం

సీఎం సారూ..మమ్ములను మరవకండి

- రేవంత్ రెడ్డిపై ఆ మూడు కుటుంబాల గంపెడు ఆశలు
- భారత్ జోడో, హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఇంటికి వచ్చి...భరోసానిచ్చిన రేవంత్
- దయనీయంగా ఆ కుటుంబాల పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



జగిత్యాల జిల్లా కిషన్‌రావుపల్లెలో మేదరి రాజంతో ముచ్చటిస్తున్న రేవంత్ రెడ్డి-(ఫైల్)

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆ కుటుంబాలు ఆశలు పెట్టుకున్నాయి. గత యేడాది క్రితం తమ ఇంటికి వచ్చి, పలకరించి...కష్ట సుఖాలు తెలుసుకొని భరోసానిచ్చిన నేత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా కావడంతో తమ బతుకులు ఇప్ప టికైనా మారుతాయని సదరు కుటుంబాలు ధీమాతో ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు గత యేడాది క్రితం పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి నిర్వహించిన భారత్ జోడో...హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతా ల్లో పర్యటించారు. ఆ సందర్భంగా జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల ప్రాంతా ల్లో దయనీయంగా బతుకుతున్న మూడు కుటుంబాల పరిస్థితిని తెలు సుకున్నారు. కష్టాల కడలిలో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వారి గాథలను స్వయంగా వినిచలించిపోయారు. కోరుట్ల మండలం కిషన్ రావుపల్లెలో మేదరి రాజం, అయిలాపూర్‌లో బజ్జీల బండి నిర్వహించే సుజాత, జగి త్యాలలో దర్జీ పనిచేసుకునే దనాల కోట నర్సయ్యల ఇళ్లకు వెళ్లి పలకరించి విస్తుపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆదు కుంటామని హామీనిచ్చారు. తదనంతరం ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తుండటం తో తమను సర్కారు అక్కున చేర్చుకుంటుందని ఎదురుచూస్తున్నారు.

అయిదుగురు కూతుళ్లతో బతుకునీడుస్తూ రాజం..

జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మండలం కిషన్‌రావు పల్లె గ్రామంలో ఎన గందుల రాజం వృద్ధాప్యంలోనూ కుల వృత్తి అయిన మేదరి బుట్టలు అ ల్లుతూ బతుకీడుస్తున్నాడు. రాజంకు అయిదుగురు కూతుళ్లున్నారు. వీరం దరికీ రాజం అప్పులు చేసి వివాహాలు జరిపించారు. ఇందులో పెద్ద కూ తురు. రాజేశ్వరీ అత్తింట్లో కుటుంబాల కలహాల కారణంగా తండ్రి వద్దనే ఉంటోంది. మూడవ కూతురు విజయ భర్త క్యాన్సర్‌తో మృతి చెందడంతో తన కూతురు, కుమారుడుతో తండ్రి వద్దనే ఉంటోంది. ఇంటి వద్దనే ఉం టున్న ఇద్దరు కూతుళ్ల బాగోగులు చూసుకునే బాధ్యత రాజం మీద ప డ్డాయి. ఈ నేపథ్యంలో గత యేడాది తమ వద్దకు వచ్చి పల కరించిన రేవంత్ రెడ్డికి సమస్యను విన్నవించుకున్నారు. బుట్టలు అమ్మితే వచ్చే డ బ్బులతో కుటుంబాన్ని ఎట్లా పోషించేది అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. పింఛన్ కావాలని, ఇళ్లు అందించాలని వేడుకున్నాడు. కాంగ్రెస్‌ను అధికా రంలోకి తీసుకొని రావాలని ఆదుకుంటామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు.

దయనీయం దర్జీ నర్సయ్య జీవనం..

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న దర్జీ దనాల కోట నర్సయ్య (68) కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉంది. నర్సయ్యకు భార్య లక్ష్మీతో పాటు ఇరువురు కుమారులున్నారు. పెద్దకుమా రుడు రాజేశ్ జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవి స్తున్నాడు. చిన్న కుమారుడు శ్రీనివాస్ భార్య బిడ్డలతో పాటు ఇంటివద్దనే ఉంటున్నాడు. వీరికి శిథిలావస్థలో గల ఓ పెంకుటిల్లు ఉంది. దర్జీ వృత్తిని చేసుకుంటూ నర్సయ్య కుటుంబాన్ని వెల్లదీస్తున్నాడు. పొద్దస్తమానం బట్ట లు కుడుతున్నప్పటికీ కుటుంబ పోషణ భారంగా మారడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. ఈనేపథ్యంలో గత యేడాది తన ఇంటికి వచ్చి పలకరించిన రేవంత్ రెడ్డికి తెలంగాణ వచ్చిన దర్జీల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సా ధ్యమవుతుందని, ఇందిరమ్మ రాజ్యం రావడానికి కృషి చేయాలని, సర్కారు ఏర్పడితే ఆదుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



జగిత్యాల గాంధీనగర్‌లో దర్జీ నర్సయ్యతో ముచ్చటిస్తున్న రేవంత్ రెడ్డి-(ఫైల్)

● మిర్చి బండి జీవనాధారంగా సుజాత...

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం లో ని అయిలాపూర్ గ్రామంలో మిర్చీ బండి ఆదారంగానే మురుమురు సుజాత జీవ న నౌకను నెట్టుకొస్తోంది. సుజాతకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. సుజాత భర్త రఘు బతుకు తెరు వు నిమిత్తం గల్ఫ్ వలస వెళ్లాడు. ఇందు లో రెండో కుమారుడు సాగర్, మూడో కుమారుడు సాయి కుమార్ సైతం విదే శాలకు వెళ్లి జీవనోపాధి పొందుతు న్నా రు. పెద్ద కుమారుడు సందీప్ సుజాత వద్దనే ఉంటూ చిన్నా చితక పనులు చే సుకుంటూ చేదోడు వాదోడుగా ఉంటు న్నాడు. సుజాతకు గత సర్కారు హయాంలో ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇంటిలో కుమారుడు, కుమార్తెతో పాటు నివాసముంటోంది. భర్త, ఇరువురు కుమారులు విదేశాలకు వెళ్లడా నికి, కుటుంబ మంచి చెడుల కోసం గ్రామంలో సుమారు రూ. 20 లక్షల వరకు అప్పులు చేశారు. వడ్డీలు, అప్పులు కట్టడానికి, కుటుంబ నిర్వహ ణకు బజ్జీల బండి ఆధారంగా మలుచుకొంది. అయితే బజ్జీల బండిపై వ చ్చిన ఆదాయం ఏ మాత్రం సరిపోకపోవడం వల్ల ఆర్థిక అవస్థలను ఎదు ర్కొంటోంది. గత యేడాది తన బండి వద్దకు వచ్చిన రేవంత్ రెడ్డికి గోడు వెళ్లబోసుకొని ఆదుకోవాలని కోరింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద లకు న్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు. జగిత్యాల జిల్లాలో రేవంత్ రెడ్డిచే భరోసా అందుకుంటున్న ఈ మూడు కుటుంబాలు ప్రస్తుతం ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సారూ మమ్మల్ని జర మరవకండి అంటూ వేడుకుంటున్నాయి.



సాయం కోసం చూస్తున్న సుజాత

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మంథనిరూరల్, ఫిబ్రవరి 4: మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన చంద్రయ్య(50) అనే రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిడంతో ఆదివారం మృతిచెందాడు. చంద్రయ్య పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. పని పూర్తి చేసుకుని మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి మీదకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 4: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని సైకాలజిస్ట్ రవికాంత్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వెంటాడుతున్న మొగి పురుగు

- తెగులు ఉధృతికి ఎర్రబారుతున్న పొలాలు
- దిగుబడిపై ప్రభావం
- నాట్లు వేసిన పదిహేను రోజుల నుంచే
- పంటను ఆశిస్తున్న పురుగు
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు



జిల్లాలో మొగిపురుగు సోకిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరి రైతును మొగి పురుగు వెంటాడుతోంది. గత యాసంగిలో సోకినట్లుగానే ఈ సీజన్‌లో సైతం వరి పంటలను మొగి పురుగు ఆశిస్తోంది. భారీ వర్షాల కారణంగా వానాకాలం వరి పంట అన్నదాతకు నష్టాలే మిగి ల్చింది. ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. దీనికి తోడు కాలువల ద్వారా సాగు నీరు అందిస్తుండడంతో రైతులు యాసంగిలో ముమ్మరంగా వరి నాట్లు వేశారు. వేసిన 15 రోజుల్లోనే వరిలో మొగి పురుగు సోకి కాండం కుళ్లిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అక్కడక్కడ మొగి పురుగు సోకుతోందని నిపుణులు అంటున్నారు. తెగులు ఉధృతికి పంట ఎర్రబారుతోందని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ సమా చారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో వరి సాగు సుమారు 30.43 లక్షల ఎకరాల్లో ఉండగా అందులో జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2,69,817 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పిలకదశలోనూ ఉన్నాయి.

● అన్నదాతకు అదనపు వ్యయం..

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరు ట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మొగి పురుగు ప్రభావం అధికంగా ఉంది. ప్రతీ యేటా మొగి పురు ఉధృతి పెరుగుతోంది. రైతులు పంట మార్పిడి చేయడం లేదు. పొలం పూర్తిగా ఎండిపోకుండానే మళ్లీ సాగు ప్రారంభించడం, దుక్కి మందులో సల్ఫర్ అధికంగా వాడడంతో పొలాలు వదులై మొగి పురుగు ఉధృతి పెరుగుతోందని వ్యవసాయ నిపుణులు, అధికారులు అంటున్నారు. ప్రస్తుత యాసంగిలో వరి నారుమడులపైనే రెక్కల పురుగు ఉంటుంది. నివారణ కోసం పురుగు మందు పిచికారి వేసి కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేశారు. పురుగు పెట్టిన గుడ్లు ఎదిగి కాండం కింది భాగాన్ని తొలుస్తున్నాయి. తర్వాత దశలో కంకి తెల్లగా మారుతోంది. చివరికి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు అదనంగా వ్యవసాయ పె ట్టుబడులు పెడుతున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం ఎక్కువవుతోం ది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



మొగి పురుగుతో ఎర్రబారిన వరి



నివారణ చర్యలు తీసుకుంటేనే ఫలితం..

ఈ యాసంగిలో నారుమడి, పిలక దశల్లో మొగి పురుగు అధికంగా గమనించాం. నారుమడిలో 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలి. నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయస్సున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి. అనంతరం వరి పంట చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు రెక్కల పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం, ఎస్‌పి 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఐసోసైక్లోసిరమ్ 0.6 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

- బలరాం, సీనియర్ శాస్త్రవేత్త, జగిత్యాల జిల్లా

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సమీక్ష

● సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లే ఆఫ్‌తో మూసివేసిన నిజాం షుగర్స్ కర్మాగారాలను పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం హైద్రాబాద్‌లోని సీఎం పేషీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పరిచారు. నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో గల నిజాం షుగర్ పునరుద్ధరణ కోసం పరిశీలించాల్సిన అంశాలు, కొన్ని సంవత్సరాలుగా కర్మాగారాలు మూసివేసి ఉండడం వల్ల మిషనరీ పరిస్థితి, రైతుల ఆసక్తి, చెరుకు సాగు తదితర అంశాలపై పలు వివరాలను సేకరించారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఛైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో కలిసి సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపారు. ఏ విధంగా నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపించాలి, ఆర్థిక పరిస్థితి, బకాయిల చెల్లింపు, మిషనరీ పునరుద్ధరణ, ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి, రైతులకు చేకూర్చాల్సిన మేలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో చెరుకు రైతులకు తీపి కబురు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్నికల సందర్భంగా చెరుకు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారని వివరించారు.


సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 4: ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించవచ్చని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మశాలి కళ్యాణ భవనం వరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మశాలి కల్యాణ భవనంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా సమస్యలతో కార్మికులు సతమతం అవుతూ కష్టాలను నష్టాలను ఓర్చుకుంటూ విద్యార్థులకు సేవలనందిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు వెళ్లడంతో అప్ప టి ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. వేయి రూపాయల నుంచి మూడు వేల రూపాయల వేతనా లు పెంచడానికి అంగీకరించిందన్నారు. ఎన్నికల సమయం కావడం వల్లే అప్పటి ప్రభుత్వం వేతనాలను పెంచుతామన్నారు తప్పా చిత్తశు ద్ధితో హామీనివ్వలేదని అర్థం అయిందన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకే వేతనాలు దిక్కులేదం టే గత ప్రభుత్వం అల్పాహారం అంటూ కార్మికులపై అదనపు భారం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యతతో పోరాటాలు చేస్తే తప్పా ఈ ప్రభుత్వాలు దిగిరావని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, పెన్షన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రక టించిన కార్మికులకు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం కార్మికులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాం ఇవ్వాలని అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, రాష్ట్ర నాయకుడు ధర్మల రామ్మూర్తి, జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మన్, జిల్లా ఉపాధ్యక్షులు పంతం రవి, లక్ష్మి, మహేశ్వరీ, మల్లవ్వ, కొమరవ్వ, సాయిలు, కొమరయ్య, హసీనాబేగం లావణ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వివిధ మండలాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 4: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకుని రోజు రోజుకు ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న క్షేత్రానికి తరలివచి ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ క్యూలైన్‌ల ద్వారా భక్తులు రాజన్న ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు శ్రీస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. తదనంతరం అనుబంధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ ఆమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలను నెత్తిలో పెట్టుకుని డప్పుచప్పుల్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, ఫిబ్రవరి 4: గంగాధర మండలం గర్షకుర్తిలో ఆదివారం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయికల్, ఫిబ్రవరి 4: రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మహేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. లంచం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలతో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో మ హేందర్ కోర్టు విధులు నిర్వర్తిస్తుంటారు. కానిస్టేబుల్ మహేందర్ ఓ కేసు విష యంలో తరచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. పూర్తి ఆరాధాలు సమర్పిం చాడు. దీనిపై విచారణ చేసిన ఎస్పీ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డబ్లింగ్ పనులతో పలు రైళ్ల రాకపోకలు రద్దు

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మౌలాలి నుంచి సనత్‌నగర్ రైల్వే స్టేషన్ మధ్య డబ్లింగ్ పనులతో పాటు నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దుచేశారు. 17011/12 హైదరాబాద్ నాంపెల్లి నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. 17233/34 నంబర్‌గల భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ రైలు కేవలం కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యనే నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4: మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఎలాలా రవికాంత్ రెడ్డి (45) మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం అమ్మక్కపేటకు చెందిన రవికాంత్‌రెడ్డి బైక్‌పై డబ్బ నుంచి అమ్మ క్కపేటకు వెళ్తున్నాడు. డబ్బ గ్రామానికి చెందిన గరికే ప్రసాద్ బైక్‌పై గ్రామ శి వారు నుంచి ఎదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీ వ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మాధ్యలో రవికాంత్‌రెడ్డి మృతి చెందాడు. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా నిజామాబాద్ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. రవికాంత్‌రెడ్డికి ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు


హోటల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీలో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా వ్యవహరించి, అనుమతులు లేకుండా అనధికారికంగా ఆనంద్ భవన్ హోటల్ పేరుతో వ్యాపారంపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. ఆదివారం వేకువ జామునే పట్టణంలోని పార్క్ ఎదుట టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఆనంద్ భవన్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఆనంద్ భవన్‌పేరుతో నడపబడుతున్న ఈ హోటల్ ఒప్పందానికి వ్యతిరేకంగా నడుపబడుతుందని, అందుకే ఈ హోటల్‌ను సీజ్ చేసి నట్లు తెలిపారు. ఇందులో పని చేస్తున్న సిబ్బంది, వారికి సంబంధించిన సామానులను భవనం నుంచి ఖాళీ చేయించామన్నారు. హోటల్ మూసివేసే క్రమంలో అన్ని విధాలుగా నిబంధనలు పాటించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వ హిస్తున్న ఈ హోటల్‌కు నోటీసులు అందించామని, నిర్వాహకుల నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేనందునే చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఈ అంశంపై పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడం, ప్రజలనుంచి అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అనూహ్యంగా ఆదివారం వేకువజామునే సీజ్ చేయడం ప్రస్తుతం జగిత్యాల పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి జాతీయ పురస్కారం

- అవార్డు ఫలితాలు వెల్లడించిన రంగినేని ట్రస్ట్ కన్వీనర్ లక్ష్మణ్




అవార్డు పొందిన కవిత్వ సంకలనం, కవి వంశీకృష్ణ

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలను ప్రోత్సహిస్తూ ఉత్తమ సాహిత్యానికి బాటలు వేస్తున్న సిరిసిల్లకు చెందిన రంగినేని సుజాతమోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతీ సంవత్సరం జాతీయస్థాయిలో అందిస్తున్న రంగినేని ఎల్లమ్మ జాతీయ సాహిత్యా పురస్కారం 2023 ఫలితాలను ట్రస్ట్ అధ్యక్షుడు రంగి నేని మోహన్‌రావు, అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం వెల్లడించారు. ట్రస్ట్ ద్వారా ఒక సంవత్సరం కథాసంపుటికి, మరో సంవత్సరం కవితా సంపుటికి అవార్డులను అందిస్తున్నారు. 2023 సంవత్సరానికి పోటికి వచ్చిన కవితా సంపుటిల్లో వరంగల్ జిల్లాకు చెందిన కవి, కథకుడు, విమర్శకుడు వంశీ కృష్ణ వెల్లడించిన రెప్ప వాలని రాత్రి కవితా సంపుటి ఎల్లమ్మ జాతీయ పురస్కారం దక్కించుకుంది. మార్చిలో ట్రస్ట్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. వరంగల్ జిల్లా గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన తాటికొండల వంశీ కృష్ణ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. 1990 నుంచి రచన, వ్యాసాంగాన్ని ప్రారంభించి ఐదు కవిత్వ సంపుటాలు, రెండు కథ సంపుటాలు, రెండు సినిమా వ్యాస సంకలనాలు వెలువరించారు. కవిగా కాకుండా మంచి విమర్శకుడిగా కూడా తన రచనలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ సినీ విమర్శకుడి అవార్డును కూడా వంశీ అందుకున్నారు. రంగినేని జాతీయ పురస్కారానికి ఎంపికైన వంశీని పులువురు, రచయితలు, కవులు అభినందించారు.

పరిహారం కోసం పడిగాపులు

- 15 ఏళ్లుగా మిడ్‌మానేరు నిర్వాసితుల నిరీక్షణ
- గత ప్రభుత్వంలో పరిహారం చెల్లింపుపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు


మానువాడలో నిర్మించిన మధ్య మానేరు జలాశయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: తమ సర్వస్వాన్ని దారపోసి మధ్యమానేరు జలాశయానికి ఊపిరిపోసిన నిర్వసితులు పరిహారం కోసం పడిగాపులుకాస్తున్నారు. తమవిలువైన భూములు, తమ గొడ్డుగోద ఉపాధిని వదిలేసి పొట్టచేత పట్టుకుని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు పొట్టచేతబట్టుకుని ఉన్నఫలంగా తరలివచ్చారు. బోయినపల్లి మండలం మానువాడ వద్ద ఏర్పాటు చేసిన మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11 గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజి పల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008 సంవత్సరంలో 12 గ్రామాల్లో 10,683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ముంపునకు గురువుతున్న ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతోపాటు వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 సంవత్సరం నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10,683 కుటుంబాలకు గాను 10,044 కుటుంబాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. మిగతా 639 మంది నిర్వాసిత కుటుంబాలకు 219 మంది కుటుంబాలకు చెందిన నిర్వాసితుల సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ. 20.22 కోట్లుతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 మంది నిర్వాసిత కుటుంబాల్లో కొంత మంది కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ. 30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం వుందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తు 10 సంవత్సరాలు గడిచిన పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిర్వాసితుల పక్షాన నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితులు గంపెడు ఆశతో వున్నామని చెబుతున్నారు.

● 501 మంది యువతకు అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురువుతున్న నిర్వాసిత యువతి, యువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతీ ఒక్కరికి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3,917 మంది యువతను గుర్తించారు. అందులో యవతులు 2,303 మందికి గాను 1,879 మందికి రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89 మంది యువతల సంతకాలు మాత్రమే సేకరించారు. వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సివుంది. కాగా 1,614 మంది యువకులకు గాను 1,537 మందికి పరిహారం చెల్లించగా 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు వారికి ఇంక చెల్లించాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

- నాగుల శంకరయ్య, సంకెపల్లి



వేములవాడ మండలం సంకెపల్లి గ్రామం మాది. తన ఇళ్లు ముంపునకు గురువుతుంది. అధికారులు వచ్చిన దరఖాస్తులు తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులపై శ్రద్ధ తీసుకుని పరిహారం త్వరగా ఇప్పించాలని కోరుతున్నాం.

సంతకాలు తీసుకున్నారు.. పరిహారం రాలేదు..

- జి జ్యోతి, రుద్రవరం, నిర్వాసిత యువతి



మాది రుద్రవరం గ్రామం. ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకారం నేకు పరిహారం అందాల్సిఉంది. గ్రామపంచాయతీకి వచ్చి అధికారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకుని వెళ్లారు. ఇప్పటి వరకు పరిహారం మాత్రం అందలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని పరిహారం అందజేయాలి.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రా ధాన్యం ఇస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాము. ఎన్నికల సమయంలో నిర్వాసిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చాము. గ్రామా నికి ఒక్క ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి సమ స్యలను పరిష్కరిస్తాము. 15 రోజుల్లో నిర్వాసి తుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తాం. కంపెనీల ఏర్పాటుతో నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం.

భయాందోళనలో పాషిగామ ప్రజలు

వెల్గటూర్, ఫిబ్రవరి 4: అపరిచిత వ్యక్తులు పాషిగామ గ్రామంలో సంచరిస్తుండడంతో పాషిగామ గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గత నెల 26న దొంగలు వాసం సతీష్ ఇంటిలో రూ.75 వేలు, నలిమెల మల్లేష్ అనే రైతు ఇంటిలో రూ.31 వేల నగదు దొంగిలించారు. రెండు రోజుల క్రితం మరో వ్యక్తి ఇంటిలో దొంగతనానికి విఫల ప్రయత్నం చేశారు. శనివారం అర్ధరాత్రి దొంగలు గ్రామంలో చొరబడ్డారనే విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. రాత్రంతా జాగారం చేశారు. పోలీసులకు సమాచారం అందించారు. చివరికి గ్రామంలో చొరబడ్డ అపరిచిత వ్యక్తులను గ్రామంలోని యువకులు, పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న వ్యక్తులను స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం వారు వన్య ప్రాణులను వేటాడే వాళ్లని తేలినట్లు ఎస్సై శ్వేత స్పష్టం చేశారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: మున్నూరుకాపు కులస్థుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘ సెక్రటరీ జనరల్ హరి అశోక్‌కుమార్ యువజన సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దశరథం, ప్రధాన కార్యదర్శి మహేందర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘం తరుపున బీసీ సంక్షేమ మంత్రి ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్‌లను కలిసి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని విన్నవించామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, హైద్రాబాద్‌లో మున్నూరుకాపు భవన్ నిర్మాణానికి రూ.5 ఎకరాల స్థలం, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇవ్వబోయే నామినేటెడ్ పదవుల్లో మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే ప్రతి జిల్లాలో సంఘ భవనాలకు స్థలాలు, నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు.

ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ఫిబ్రవరి 4: మల్యాల మండల కేంద్రంకు చెందిన తాటిపాముల ప్రియాంక గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా చికిత్స కోసం రూ.4లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ప్రియాంక గురించి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కం వినయ్ ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం నుంచి ఎల్వోసీని మంజూరు చేయించారు. దీంతో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎల్వోసీని అందించారు. ఈ కార్యక్రమంలో శనిగారపు తిరుపతి, కోరెపు వెంకటేష్, గుర్రం రంజిత్, కుసుమ వివేక్ ఉన్నారు.

● రూ.10వేల సహాయం..

తాటిపాముల ప్రియాంకకు మల్యాలకు చెందిన మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మ్యాదరి లవన్‌కుమార్, నఫీజొద్దీన్, కొక్కుల అజయ్, బొట్ల శేఖర్, బండారి చందన్‌కుమార్, తాళ్ల రోహిత్, తాటిపాముల సాయి, తరుణ్, కొక్కుల వేణు, ఉంగరాల సంజయ్, వడ్లకొండ సాయికుమార్, రుద్రోజి రంజిత్ పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు



కొలతలు తీస్తున్న అధికారులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 4 :సారంగాపూర్ ఎస్సీ కాలనీలో మురికి కాలువలు లేక కొంత కాలంగా కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఇటీవల కాలనీ వాసులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన జీవన్‌రెడ్డి ఈజీఎస్ నిధుల నుంచి రూ, 15 లక్షలు మంజూరీ చేశారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు సర్వే పూర్తి చేశారు. ఈ మురికి నీటిరి 200 మీటర్ల దూరంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలో కలుపనున్నారు. ఈ మేరకు కాలనీ వాసుల సమస్య తీరనుండటంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, నాయకులు ఏలూరి రాజిరెడ్డి, పురుమల్ల లక్ష్మారెడ్డి, చేకుట శేఖర్, నలువాల రాజయ్య, కొక్కు ఉదయ్, కుంటాల సోలమాన్, నలువాల సంపూర్ణ ఉన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచు కృష్ణారావు

కొడిమ్యాల, ఫిబ్రవరి 4 : హిమ్మతురావుపేట గ్రామంలో ఆదివారం వీరనారి చాకలి అయిలమ్మ విగ్రహాన్ని గ్రామ మాజీ సర్పంచు పునుగోటి కృష్ణారావు ఆవిష్కరించారు. గతంలో గ్రామ మాజీ సర్పంచు కృష్ణారావు సుమారు 2 లక్షల రూపాయల విలువైన భూమిని అయిలమ్మ విగ్రహ ఏర్పాటుకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రశాంతి, గ్రామ పంచాయతీ మాజీ పాలక వర్గ సభ్యులు, గ్రామ ప్రముఖులు పునుగోటి శ్రీరంగరావు, రజక సంఘం నాయకులు ఆకునూరి మల్లయ్య, లింగయ్య, బుచ్చయ్య, తిర్మలాపూర్, కొడిమ్యాల సింగిల్ విండోల చైర్మనులు రాజేందర్, రాజనర్సింగరావు, విజయ పాలడైరీ జిల్లా అధ్యక్షుడు ఆరె మల్లేశం, మండల రజక సంఘం నాయకులు, గ్రామ ప్రముఖులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలకు చెందిన మహేష్(25) అనే యువకుడు తన మిత్రులు వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీకి చెందిన ప్రమోద్, తేజ ఇంటికి వచ్చాడు.

ప్రమోద్, తేజ కుటుంబాలు వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద విందు ఏర్పాటు చేశారు. విందుకు హాజరైన ముగ్గురు యువకులు తిరిగి ఒకే ద్విచ క్రవాహనంపై వేములవాడకు వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని మహా త్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రమోద్, తేజకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రహదారులు బాగుపడేదెన్నడో..?

● గుంతలతో అవస్థలు ● మరమ్మతులు చేయాలని వినతి



కంకరతేలిన వెల్దుర్తి రహదారి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 4 : గ్రామీణ ప్రాంతాల్లోని పల్లెలను మండల, పట్టణ ప్రాంతాలకు కలిపేవిధంగా గతంలో నిర్మించిన రహదారులకు నిధులు మంజూరులేక మరమ్మతులు చేపట్టకపోవడంతో కంకరతేలి, గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వాలు మారుతున్నా రహదారులకు నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడంలేదు. చాలా రోజుల నుంచి రహదారులకు మరమ్మతులు లేకపోవడంతో రహదారిపై ప్రయాణించడానికి గ్రామాల ప్రజలు, ప్రయాణికులు నరకయాతనపడుతున్నారు.

జగిత్యాలరూరల్ మండలం తిమ్మాపూర్, వెల్దుర్తి రహదారులు గుంతలు ఏర్పడి, కంకరతేలి అధ్వానంగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, మార్కెట్, పాఠశాలలు బ్యాంకులు, ఇతర వాణిజ్య అవసరాల నిమిత్తం రైతులు, విద్యార్థులు, రహదారిపై రాకపోకలు సాగిస్తారు. రోడ్డు చెడిపోవడంతో ప్రయాణం చేయడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. 10 రోజుల క్రితం తిమ్మాపూర్ రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి రోడ్డు కంకర తేలి, గుంతలతో అధ్వానంగా మారిందని గ్రామస్థులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నుంచి వెల్దుర్తి, బావాజీపల్లె, వంజరిపల్లె, నర్సింగాపూర్ గ్రామాలకు నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతాయని, సంవత్సరాల పొడవు నుంచి రోడ్డు అద్వానంగా మారడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు కొన్నిసార్లు గుంతలలోపడి గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వేకువజామున మార్కెట్‌కు వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కంకర తేలి ఇబ్బందులు పడుతున్న ఇప్పపల్లి తండావాసులు

● సర్వేలకే పరిమితం

కథలాపూర్: మారుమూల ప్రాంతాల రోడ్లను అద్దంలా మార్చి అవస్థలు తీర్చుతామని గత ప్రభుత్వ పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. అనేక సార్లు రోడ్లకు నిధులు కేటాయించడానికి ఇంజినీరింగ్ అధికారులతో సర్వేలు చేసినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచి తమ రోడ్డును బాగు చేయాలని మొత్తుకుంటున్నప్పటికీ పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని మండలంలోని ఇప్పపల్లి గిరిజనులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పపల్లికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ తండాకు నేటికీ ఆర్టీసి బస్సు వసతి లేదు. ఏ రాత్రి ఇంటికి చేరుకోవాలన్నా కేవలం ద్విచక్ర వాహనాలే దిక్కవుతున్నాయి. ఇప్పపల్లి ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, ఎంపీలకు పలుమార్లు ఈ రోడ్డుకు నిధులు కేటాయించాలని విన్నపాలు చేసినా ఫలితం శూన్యమే అయింది. పూర్తిగా కంకర తేలి ఉండడంతో కాలినడకకు సైతం ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. వానాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే హడలి పోతున్నారు. అటు వైపు ఇప్పపల్లి రైతులు తమ పంట పొలాల వద్దకు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు కేటాయించి బాగు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



కంకర తేలిన ఇప్పపల్లి తండా రోడ్డు

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

కొడిపెల్లి రాజు, తిమ్మాపూర్



జగిత్యాలరూరల్ మండలం తిమ్మాపూర్ రహదారి గుంతలుగా మారి, కంకరతేలి అధ్వానంగా మారింది. నిత్యం ఈ రహదారి నుంచి రఘురాములకోట, తిమ్మాపూర్, పొలాస మీదుగా వందల సంఖ్యలో నిత్యం ప్రయాణికులు, గ్రామస్థులు, రైతులు, పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి చెడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతూ 10 రోజుల క్రితం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

గుంతలతో అవస్థలు పడుతున్నాం

బొక్కల కిషన్, వెల్దుర్తి



జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బదిన్నది. ఈ రహదారి నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. గుంతలు ఏర్పడి, కంకర తేలడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. గుంతల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త వారు ఈ దారి గుండా వస్తే గుంతలు ఏర్పడక ప్రమాదాల బారిన పడతారు. ప్రజాప్రతి నిధులు, అధికా రులు స్పందించి వెంట నే రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

నేటి నుంచి గావ్ చలో అభియాన్

ధర్మపురి, ఫిబ్రవరి 4: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 5 నుంచి 8 వరకు ప్రతి గ్రామంలో నిర్వహించనున్నట్లు బీ జేపీ ధర్మపురి అసెంబ్లీ కో-కన్వీనర్ బండారి లక్ష్మణ్ తెలిపా రు. ధర్మ పురి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గల కమలాపూర్ గ్రామంలో నిర్వహించే కార్యక్రమానికి బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలానికి చెందిన ఒక నాయకుడు గ్రామ వాసిగా వెళ్లి అక్కడ 24 గంటలు ఉండి అభియాన్‌లో సూ చించినట్లు వివిధ క్షేత్రాలు, వర్గాల వారిని కలిసి చేపట్టాల్సిన కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉం టుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త గ్రామాల్లో గ్రామ వాసి కార్యకర్త చేరుకుంటే వెంట ఉండి సహకరిం చాలని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, ఆకుల శ్రీనివాస్, స్తంభంకాడి శ్యాంసుందర్, తోట శ్రీనివాస్, అప్పం మల్లేష్, మదు తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారి లక్ష్మణ్

'ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి'

ధర్మపురి, ఫిబ్రవరి 4: ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూఅకాడమీ ఫౌండర్ రాజమల్లు అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో బెల్టుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజమల్లు మాట్లాడుతూ కుంగ్ ఫూ నేర్చుకోవడం వల్ల ఆత్మ స్థైర్యం పెంపొందడంతో పాటు ఆత్మ రక్షణ కోసం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం కుంగ్ ఫూ ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పొట్ట మీద బండ రాళ్లను పగులగొట్టడం, శరీరం పైనుంచి బైక్ నడపడం తదితర విన్యాసాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథుల చేతుల మీదుగా 150 మంది విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందించారు. డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ అకాడమీ ప్రెసిడెంట్ రాజేందర్, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, సీనియర్ మాస్టర్లు రమణ, ముజాయిద్, చంద్రయ్య, విద్యార్థుల పేరెంట్స్ పాల్గొన్నారు.



విద్యార్థులు చేస్తున్న కరాటే విన్యాసాలు

దశలవారీగా అభివృద్ధి పనులు

చందుర్తి, ఫిబ్రవరి 4: దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం రామారావుపల్లెలో బీరప్ప ఆలయం వద్ద సీడీపీ నిధులు లక్షా 50 వేల రూపాయలతో వేసిన బోరు మోటర్‌ను ఆదివారం ప్రారం భించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ బోర్ మోట ర్‌కు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు అజయ్‌రెడ్డి, నాగిరెడ్డి, పెద్ది బీరయ్య, తిరుపతి, మోహన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒబులాపూర్‌లో రెండిళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 4: తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ గ్రామంలో రెండిళ్లలో చోరి జరిగింది, గ్రామానికి చెందిన పోచంపెల్లి బాలకిషన్ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తు తెలి యని దుండగులు తాళం పగల గొట్టి రూ. 40వేల నగదుతో పాటు అర తులం బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లారు. పోచంపెల్లి పోచవ్వ ఇంటి తాళం పగలగొట్టి రూ. 7500 నగదుతో పాటు పావుతులం బంగారం ఎత్తు కెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ యువతను ప్రభుత్వ ప్రోత్సాహం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 4: గ్రామీణ ప్రాంత యువతను అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామంలో జడ్పీటీసీ పుర్మాణి మంజులలింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తున్న జడ్పీటీసీ మంజులతో పాటు నాయకులు పుర్మాణి లింగారెడ్డి, జల్లం ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సూర దేవరాజ్, వైద్య శివప్రసాద్, జల్లం ప్రవీణ్, పుర్మాణి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాములు, మునిగెల రాజు. కట్కం రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిక..

రాళ్లపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు సక్రమంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపైన ఉందన్నారు.

●తంగళ్లపల్లి ఫ్రెండ్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎడ్మాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సామాల గణేశ్, కోశాధికారి జుకంటి శంకర్, సాంస్కృతిక కార్యదర్శి ముక్క శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, లింగాల భూపతి, మోర రాజు, నగరం సత్యనారాయణరెడ్డి, సామాల వెంకటేశం, కోడం చందు తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని మురికి కాలువ నిర్మాణ పనులు

●పట్టించుకోని అధికారులు.. ●ఇక్కట్లలో ప్రజలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 4 : మండలంలోని కోనరావుపేట గ్రామంలోని 8వ వార్డులోని నూతనంగా మురికి కాలువ ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వదిలేయడంతో బాటసారులు, వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలానికి నిధులు మంజూరు అయ్యాయి. గ్రామంలోని 8వ వార్డులో మురికి కాలువ సమస్య ఉందని కాలనీ వాసులు తెలుపడంతో ఎంపీపీ నిధులు మంజూరు చేయించారు. సీసీ రోడ్డుకు మధ్యలో కాంట్రాక్టర్ పనులు 25 రోజుల క్రితం ప్రారంభించినట్లు వార్డు మెంబర్ జక్కని పరంధాం తెలిపారు. మురికి కాలువ నిర్మాణ జరిగిన సమయంలో క్యూరింగ్ చేయడం లేదని పలు మార్లు అధికారులకు తెలిపిన వచ్చి పరిశీలించలేదని కాలనీ వాసులు తెలిపారు. దీంతో మురికి కాలువ పెచ్చులు ఊడిపోతున్నాయని తెలిపారు. రోడ్డుకు మధ్యలో మురికి కాలువ నిర్మాణం పనులు పూర్తి చేసినప్పటి నుంచి కాలనీలలో రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మాణం పనులు పూర్తి అయి మూడు వారాలు కావస్తున్నా కాలువపై బెడ్డను ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను కోరిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మురికి కాలువపై బెడ్డు ఏర్పాటు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కోనరావుపేటలోని రోడ్డు మధ్యలో నిర్లక్ష్యంగా నిర్మించిన మురుకి కాలువ

నేడు జాతర బ్రహ్మోత్సవాల విక్రయాలకు టెండర్లు

బీర్‌పూర్,ఫిబ్రవరి 4: జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి మార్చి నెల 2వ తేది వరకు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఆయా వ్యాపారులు సామగ్రి విక్రయాలకోసం సోమవారం మధ్యహ్నం టెండర్లు నిర్వహించనున్నారు. ఈ టెడర్లు లక్ష్మీనరసింహా స్వామి ఆలయ ఆవరణం గుట్టపై మధ్యహ్నం రెండు గంటలకు సీల్డు కోటేషన్స్ బహిరంగ వేలం పక్రియ ప్రారంభించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. టెండర్లు వేయాడానికి ఆసక్తి గల వారు సమయానికి రావాలని కోరారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా సురేష్

కొడిమ్యాల, ఫిబ్రవరి 4 : మండలంలోని నాచుపల్లి గ్రామ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా సిరిసిల్ల సురేష్‌ను ఆదివారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఐట్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వీరబత్తిని గణేష్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆర్థిక సహాయం

బీర్‌పూర్, ఫిబ్రవరి 4: మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందినా దమ్మల్ల శేఖర్ గత ఐదు రోజుల క్రితం క్యాన్సర్ వ్యాధితో చనిపోయాడు. మృతుడు శేఖర్‌కు బార్య రజిత, కూతుర్లు రేష్మా, రితికలు ఉన్నారు. పిల్లల చదువు నిమిత్తం గ్రామా మాజీ సర్పంచ్ గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్‌లు శేఖర్ కుటుంబ సభ్యులన పరామర్శించి ఐదు వేయిల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించారు. వీరి వెంటా దన్నపునేని సంజీత్ రావ్, గంగమల్లు, మల్లేశ్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా చౌడాలమ్మ కల్యాణం

ముస్తాబాద్, ఫిబ్రవరి 4: మండలంలోని బందన కల్‌లో చౌడలమ్మ కల్యాణ మహోత్సవాన్ని యాదవ సామాజికవర్గం సభ్యులు కన్నుల పండువగా నిర్వహించారు. లగ్గం బోనాలు తీసిన అనంతరం ఆదివారం చౌడలమ్మ, దేశపతిరాజు కల్యాణ మహోత్సవాన్ని భక్తుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు లగ్గం పట్నాలు వేశారు. శివసత్తుల పూ నకాల మధ్య వేడుకలను నిర్వహించారు. కట్నకానుకలు సమర్పించుకు న్నారు. సోమవారం నాగవెల్లి పట్నం వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సామా జిక వర్గం సభ్యులు రాయం ముత్యం, బాలయ్య, ఐలయ్య, బాలెల్లు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

వీర్నపల్లి: ఫిబ్రవరి 4: మండలంలోని కంచర్ల గ్రా మంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బో నాలను ముదిరాజ్ కులస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని బైండ్ల వారి ఆటపాటలు, డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పిం చారు.

విద్యార్థికి సన్మానం

రుద్రంగి, ఫిబ్రవరి 4: సాంఘికశాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో రుద్రంగి మండలం మానాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గుర్రపు అజయ్ మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక కావడంతో ఆదివారం మానాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్ అల్లూరి మానస, వీడీసీ చైర్మన్ రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థి గుర్రపు అజయ్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూమ్ జలపతి, జక్కు మోహన్, జక్కు వంశి, లక్ష్మణ్, దీలీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని మహిళపై దాడికి పాల్పడిన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని షేక్ అహ్మద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని మహిళా ఆలీమా, షేక్ అహ్మద్ కుటుంబంతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న మహిళ పై సోషల్ మీడియాలో అసభ్యకర వాయిస్ మెసేజ్ పోస్ట్ చేశాడని చెప్పారు. ఎందుకు అసభ్యకరంగా వాయిస్ మెసేజ్ పోస్ట్ చేశావని పేర్కొంటూ మహిళా షేక్ అహ్మద్‌ను నిలదీయడంతో ఆగ్రహించిన ఆయన ఇనుప చువ్వతో తలపై దాడికి చేశాడని పేర్కొన్నారు. చంపుతానని బెదిరిం చాడని తెలిపారు. బాధితురాలు అలిమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.